ఒగ్గు కథలను పరిరక్షించుకోవాలి: కిషన్‌రెడ్డి



బోనాల సాంగ్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

అంబర్‌పేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మంలో ఉన్న ఒగ్గు కథలు ఇప్పటికీ పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని, ఈ మేరకు ఒగ్గు రాము పాటలు రాయడం అభినందనీయమని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి ప్రశంసించారు.ఆషాఢ మాసంలో బోనాల సందర్భంగా అంబర్‌పేట మహంకాళి ఆలయం అంబర్‌పేట మంకాలమ్మ బోనాల సాంగ్‌పై అంబర్‌పేటలో నివాసం ఉంటున్న ఒగ్గు రాము రాసిన పాట బ్రోచర్‌ను కిషన్‌రెడ్డి ఆదివారం ఆవిష్కరించి, మాట్లాడారు. ప్రస్తుతం యువకులు కళల పట్ల ఆసక్తిని కనబరుస్తూ ఆధ్యాత్మిక భావనతో ఒగ్గు కథ వంటి పాటలు రాయడం అభినందనీయమన్నారు. ఒగ్గు రాములును కిషన్‌రెడ్డి సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, నాయకులు ఏడెల్లి అజయ్‌కుమార్, సి.నందకిషోర్‌యాదవ్, పి.నాగరాజు, చారి, ఏడెల్లి బాలు, ఎ.యశ్వంత్, సునీల్, కోడూరు శ్రీశైలం, రవి రమేష్, సిద్ధు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికలకు బీజేపీ శ్రేణులు సిద్ధం కావాలి



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావును సన్మానిస్తున్న అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు పాశం సాయికృష్ణయాదవ్ తదితరులు

రాంనగర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు సూచించారు. బీజేపీ అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు పాశం సాయికృష్ణయాదవ్ ఆధ్వర్యంలో పార్టీ రాష్ట్ర నూతన అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావును ఆయన నివాసంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ పార్టీ సిద్ధాంతాలు, మోదీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలలోకి తీసుకెళ్లాలని సూచించారు. అడిక్‌మెట్‌లో బీజేపీ గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు తగిన ప్రణాళికను రూపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శేషసాయి, కౌండిన్యప్రసాద్, దర్గా నర్సింగ్‌రావు, జనార్థన్‌రెడ్డి, పవన్‌రెడ్డి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

రామచందర్‌రావు నియామకం గర్వకారణం



బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్.రామ్‌చందర్‌రావు నియామకం బ్రాహ్మణజాతికి గర్వకారణమని భాగ్యనగర్ బ్రాహ్మణ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు శిశుకుమార్ అన్నారు. ఆదివారం ఆయనను శిశుకుమార్ తదితర సంఘం సభ్యులు కలిసి శుభాకాంక్షలు తెలిపి, సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

- చిక్కడపల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి)

'తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలను ఖండించాలి'

రాంనగర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ నేపథ్యంలో ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలపై తీన్మార్ మల్లన్న చేసిన అసభ్యకర వ్యాఖ్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ కట్ట బబ్లుగౌడ్ అన్నారు. ఆదివారం రాంనగర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పరస్పర వ్యక్తిగత విమర్శలకు పోకుండా బీసీల డిమాండ్ సాధనకు పోరాడాలని అన్నారు. తీన్మార్ మల్లన్న కార్యాలయంపై దాడులు చేయడం కూడా ఎవరూ సమర్థించరని అన్నారు.

బడిబాట కోసం బస్సులు రావాలని నేటి నుంచి ధర్నాలు

బర్కత్‌పుర, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 26 వేలకు పైగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో 22 లక్షల మందికిపైగా విద్యార్థులు చదువుకుంటున్నారని వీరిలో 60 శాతం మంది విద్యార్థులు పాఠశాలలకు దూరంగా నివాసం ఉంటూ ఇబ్బందులు పడుతున్నారని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ కన్వీనర్ డాక్టర్ విశారదన్ మహారాజ్ అన్నారు. విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేసి వారిని పాఠశాలలకు తీసుకెళ్లాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 14 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో చదువుతున్న ప్రతి 30 మంది విద్యార్థులకు ఒక బస్సు చొప్పున వారిని పాఠశాలలకు తీసుకెళ్లాలన్నారు. ఈ మేరకు ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.



పిల్లలకు నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న సంగర్ జాతి సంఘ్ నేతలు

విద్యార్థులకు చేయూత ఇవ్వాలి

నల్లకుంట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చేయూత నివ్వడంలో స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని సంగర్ జాతి సంఘ్ విద్యానగర్ కమిటీ అధ్యక్షుడు కె.లక్ష్మణ్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం నల్లకుంట డివిజన్ నర్సింహ బస్తీలోని కమ్యూనిటీహాల్‌లో సంగర్ జాతి సంఘ్ విద్యానగర్ కమిటీ ఆధ్వర్యంలో 6 నుంచి 10వ తరగతి చదువుకునే 40 మంది విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా లక్ష్మణ్‌కుమార్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సంఘ్ కమిటీ ప్రధానకార్యదర్శి పింజరి నర్సింగ్‌రావు, కోశాధికారి కె.లక్ష్మణ్‌ప్రసాద్, సలహాదారులు ఆర్.కిషన్, చైర్మన్ కె.ప్రభురాజ్, వైస్‌చైర్మన్ ఎం.సురేష్, కార్యదర్శులు మహేందర్, అజయ్, గోవింద్, శివ, రాజేందర్, రవి, బబ్లు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



కవాడిగూడ మునిసిపల్ గ్యారేజ్‌లో బోనాల వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గోపాల్, తదితరులు



బోనాల వేడుకల్లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్ తదితరులు

వైభవంగా బోనాలు

- భక్తిశ్రద్ధలతో అమ్మవార్లకు నైవేద్యం సమర్పణ
- ఉదయం నుంచే వేడుకల్లో పాల్గొన్న నేతలు, భక్తులు

కవాడిగూడ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఆషాఢమాసం బోనాల పండగను కవాడిగూడ డివిజన్‌లో ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే కవాడిగూడ తాళ్లబస్తీలోని నల్లపోచమ్మ, మహంకాళి దేవాలయాల్లో భక్తులు ఉదయం నుంచే పెద్ద ఎత్తున బారులు తీరారు. బోనాలతో వచ్చి అమ్మవార్లకు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు అమ్మవార్లకు బోనాల సమర్పణతోపాటు తొట్టెల ఊరేగింపు, పోతరాజుల విన్యాసాలతో ఆధ్యాత్మికత వెల్లువిరిసింది. కవాడిగూడ మునిసిపల్ గ్యారేజ్‌లో స్వచ్ఛ గ్రేటర్ హైదరాబాద్ తెలంగాణ మునిసిపల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు బండారి యాదగిరి ఆధ్వర్యంలో బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ. బీఆర్ఎస్ రాష్ట్ర యువజన విభాగం నాయకుడు ముఠా జైసింహ, రాంనగర్ మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ నాయకుడు పూసరాజు, బీఆర్‌టీయూ యూనియన్ అధ్యక్షుడు జి.రాంబాబుయాదవ్ హాజరై పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు వారిని శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షుడు నర్సింగ్‌రావు, ప్రధానకార్యదర్శి బి.బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడు ఎ.యాదగిరి, వర్కింగ్ ప్రెసిడెంట్ పి.నర్సింగ్‌రావు, జోనల్ ప్రెసిడెంట్ ఇ.కృష్ణ, అడిషనల్ జనరల్ సెక్రటరీ కె.శివకుమార్, రమేష్, బీజేపీ రాష్ట్ర నాయకుడు జి.వెంకటేష్, డివిజన్ అధ్యక్షుడు సలంద్రి దిలీప్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి బొల్ల రమేష్, నగర నాయకులు కల్వగోపి, బి.రమేష్, కార్మికులు పాల్గొన్నారు.



ముషీరాబాద్ మహాకాళి అమ్మకు మొదటి బోనం తీసుకెళ్తున్న ఆలయ ప్రధాన అర్చకుడు, తదితరులు

ముషీరాబాద్ మహాకాళి అమ్మకు మొదటి బోనం

ముషీరాబాద్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్‌లోని మహాకాళి అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకుడు వై.చంద్రమౌళి కుటుంబం ఆదివారం మొదటి బోనం సమర్పించింది. ఈ సందర్భంగా శివాలయం వద్ద గల చంద్రమౌళి ఇంటి నుంచి పోతరాజుల ఊరేగింపు, డప్పు దరువుల మధ్య బోనాన్ని తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. దారిపొడవున భక్తులు మొదటి బోనానికి ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు శ్రీధర్‌చారి, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ఎయిర్‌టెల్ రాజు, దేవాదాయశాఖ ఈవో మహేందర్ కుమార్, నాయకులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉజ్జయినీ అమ్మవారికి ప్రత్యేక పూజలు

రాంనగర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఉజ్జయినీ మహాకాళి బోనాల సందర్భంగా టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా ఆదివారం అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నల్లెల కిషోర్, పి.బాల్‌రాజ్‌గౌడ్, ఎస్.ప్రకాష్, ఎ.బి.ఆర్.మోహన్, భానుప్రకాష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా సికింద్రాబాద్‌లోని ఉజ్జయినీ మహాకాళి ఆలయంలో అమ్మవారికి వకుళాభరణం కృష్ణమోహన్‌రావు ప్రత్యేక పూజలు చేశారు.

బోనాలకు కిషన్‌రెడ్డికి ఆహ్వానం

రాంనగర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): బాగ్ అంబర్‌పేట డివిజన్ దుర్గాబాయి దేశ్‌ము కాలనీ (డీడీ కాలనీ)లోని నల్లపోచమ్మ ఆలయంలో ఈ నెల 20న నిర్వహిస్తున్న బోనాల పండుగకు రావాలని ఆదివారం కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డిని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.గోవర్ధన్‌రెడ్డి, డాక్టర్ రాజిరెడ్డి, ప్రొఫెసర్ రామకృష్ణ పాల్గొన్నారు.



కిషన్‌రెడ్డిని బోనాల పండుగకు ఆహ్వానిస్తున్న డీడీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు గోవర్ధన్‌రెడ్డి, డా.రాజిరెడ్డి, ప్రొ.రామకృష్ణ తదితరులు

బోనాల పండగ ఏర్పాట్ల పరిశీలన

అంబర్‌పేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట డివిజన్ పటేల్‌నగర్‌లోని శ్రీనల్లపోచమ్మ ఆలయంలో ఈ నెల 20వ తేదీన నిర్వహించే బోనాల పండగ ఏర్పాట్లను కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ ఆదివారం సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీసభ్యులు భిక్షపతి, సతీష్, యాదగిరి, ప్రవీణ్, నాగరాజు, సంతోష్‌చారి, రఘు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆలయ కమిటీ సభ్యులతో కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

మానవాళికి మనోవికాస గ్రంథం భగవద్గీత

చిక్కడపల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మానవాళికి జీవనవిధానాన్ని నేర్పిన మనోవికాస గ్రంథం భగవద్గీత అని, గీత చదివి రాత మార్చుకోవాలని ప్రముఖ కవి, సాహితీవిశ్లేషకుడు రామకృష్ణచంద్రమౌళి అన్నారు. శ్రీకృష్ణంవందేజగద్గురుం ఫౌండేషన్, గీతా ఫౌండేషన్, శ్రీమతి నక్క వెంకటమ్మ, నక్క యాదగిరి స్వామి యాదవ్ ఎడ్యుకేషన్ స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం త్యాగరాయ గానసభలో భాగవద్గీత సంపూర్ణ పారాయణ కార్యక్రమం జరిగింది. అధ్యక్షత వహించిన రామకృష్ణ చంద్రమౌళి మాట్లాడుతూ భగవద్గీతను ప్రతి ఒక్కరూ చదవాలన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కేంద్ర మాజీమంత్రి సముద్రాల వేణుగోపాలచారి మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలను దశదిశలా చాటాలన్నారు. సభాసమన్వయకర్త, గీతా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పి.బడేసాబ్ మాట్లాడుతూ గీతాపారయణ కార్యక్రమాన్ని ఒక యజ్ఞంలా తలపెట్టామన్నారు. తాడూరు విశ్వేశ్వర్, ఆర్‌కే శ్రీనివాస్, టి.శ్రీనివాస్‌యాదవ్, గంటా మనోహర్‌రెడ్డి, చంద్రప్రకాష్‌రెడ్డి, సభకు ముందు కవిసమ్మేళనం నిర్వహించిన కవయిత్రి రాధాకుసుమ తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటేష్, కార్పొరేటర్ పద్మ, సీఐ కిరణ్‌కుమార్

అంబర్‌పేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): నేరాలను నియంత్రించడంలో సీసీ కెమెరాలు కీలకం అని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. ఆదివారం బాగ్‌అంబర్‌పేట డివిజన్ శారదానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఎమ్మెల్యే కార్పొరేటర్ బి.పద్మతో కలిసి ప్రారంభించారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేర శాతం తగ్గిందన్నారు. ఈ కార్యక్రమంలలో అంబర్‌పేట పీఎస్ సీఐ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులో 25 మద్యం బాటిళ్లు స్వాధీనం

అంబర్‌పేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా నడుస్తున్న బెల్ట్ షాపులో నుంచి 25 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు అంబర్‌పేట పీఎస్ సీఐ కిరణ్‌కుమార్ తెలిపారు. బాగ్‌అంబర్‌పేట డివిజన్ బతుకమ్మకుంటలో ఓ మహిళ రహస్యంగా బెల్ట్‌షాపు నిర్వహిస్తున్నట్లు అంబర్‌పేట పోలీసులకు సమాచారం తెలిసింది. దీంతో సీఐ ఆదివారం పోలీసులతో కలిసి బతుకమ్మకుంటలోని బెల్ట్‌షాపుపై దాడి చేసి అక్కడ నిల్వ చేసిన 25 క్వార్టర్స్ మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. షాపు యజమానిపై కేసు నమోదు చేశారు.

'గ్రామీణ బ్యాంకుల ప్రైవేటీకరణ వద్దు'

రాంనగర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ బ్యాంకులను ప్రైవేటీకరణ చేయొద్దని ఏఐఆర్‌ఆర్‌బీఈఏ సెక్రటరీ జనరల్ ఎస్.వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ పెన్షనర్ల సంఘం జనరల్ బాడీ మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ బ్యాంకులు గ్రామీణ ప్రాంతంలో విశిష్ట సేవలు అందిస్తున్నాయన్నారు. ప్రైవేటీకరణ చేయడంలో గ్రామీణ ప్రాంతంలో ప్రజలు, రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. గ్రామీణ బ్యాంకులను మున్ముందెన్నడూ ప్రైవేటీకరణ చేయవద్దని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీజీబీఆర్ఎస్ఏ ప్రధాన కార్యదర్శి డి.కె.గోపాల్‌రావు, ఏపీజీవీబీపీఏ జనరల్ సెక్రటరీ కె.వెంకట్‌రెడ్డిలు నివేదిక సమర్పించారు. ఏపీటీఆర్‌ఆర్‌బీఈ అధ్యక్షుడు బి.రవికాంత్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు గణపతి హెగ్డే, బి.రాజారావు, కట్ట ప్రసాద్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

'బెట్టింగ్' ప్రమోటర్లపై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న అనగంటి వెంకటేష్ తదితరులు

నల్లకుంట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకటేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో డీవైఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా స్థాయి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సెలబ్రిటీలు, ఇన్‌ఫ్లూయెన్సర్స్ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేయడంతో యువత ఆకర్షితులవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లో మొదట లాభాలను చూపించి తర్వాత మొత్తం డబ్బులను కాజేస్తున్నాయని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేస్తున్న ఎంతటి వారైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డీవైఎఫ్ఐ నాయకులు దేవేందర్, రాజయ్య, రవి, పావని, భానుకిరణ్, శ్రీను, కార్తీక్, జావీద్, సతీష్, జగదీష్, విజయలక్ష్మి, నాగరాజు, శివ పాల్గొన్నారు.

రైలు ప్రయాణికురాలి మెడలో గోల్డ్‌చైన్ చోరీ

బర్కత్‌పుర, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రయాణికురాలి మెడలోని బంగారు మంగళసూత్రాన్ని దొంగ లాక్కుని పారిపోయాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... నగరంలోని బీఎన్.రెడ్డినగర్‌లో నివాసం ఉంటున్న పద్మ(60) కుటుంబ సభ్యులతో కలిసి తిరుపతి వెళ్లింది. తిరుగు ప్రయాణంలో వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ రైలులో కాచిగూడకు వస్తుండగా మహబూబ్‌నగర్ జిల్లా మన్యంకొండ రైల్వేస్టేషన్ వద్ద రైలు ఆగింది. దొంగ కిటికీలో నుంచి పద్మ మెడలో ఉన్న రెండు తులాల బంగారు మంగళసూత్రాన్ని లాక్కుని పారిపోయాడు. ఆదివారం పద్మ కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. కేసునమోదు చేసుకుని, తదుపరి విచారణ నిమిత్తం మహబూబ్‌నగర్ రైల్వే పీఎస్‌కు బదిలీ చేసినట్లు సీఐ తెలిపారు.

ఉర్స్ మతసామరస్యానికి ప్రతీక: ఎమ్మెల్యే

ముషీరాబాద్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఉర్స్ ఉత్సవాలు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ఆదివారం ముషీరాబాద్ దాయార కమాన్ వద్దగల హజ్రత్ బందగి మియాన్ షా-ఎ-ఖాసీం ముజ్జహిద్ ఉర్స్‌ను పురస్కరించుకుని జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముస్లింలతో కలిసి సామూహిక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎడ్ల హరిబాబు యాదవ్, డివిజన్ మాజీ అధ్యక్షుడు సయ్యద్ హమ్మద్ భక్తియార్, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

'ఇష్టంతో చేసే సేవ సంతృప్తినిస్తుంది'

చిక్కడపల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఇష్టంతో చేసే సేవా కార్యక్రమం ఏదైనా కూడా సంతృప్తినిస్తుందని ప్రముఖ రచయిత, బతుకమ్మతల్లి గ్రంథకర్త డా.శాంతికృష్ణ ఆచార్య అన్నారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు, ప్రముఖ సినీనటుడు, మాజీ సీఎం నందమూరి తారక రామారావు జయంతిని పురస్కరించుకుని ఆదివారం త్యాగరాయ గాన సభలో తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో జరిగిన జాతీయ ప్రతిభాపురస్కారాల సభలో శాంతికృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. పీవీ రాజకీయంగా, ఎన్టీఆర్ సినీ రంగం ద్వారా సేవలందించారన్నారు. సంస్థ చైర్మన్ పోలోజు రాజకుమార్, అధ్యక్షత వహించిన అధ్యక్షుడు రంగిశెట్టి రమేష్, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ, తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ నాన్ టీచింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ వర్కింగ్ అధ్యక్షుడు డా.పొడిశెట్టి విష్ణువర్ధన్, శాంతాబాయి, అమృతపూడి రేవతి, ప్రశాంతి, భాస్కరాచార్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సిటీ-1 పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ జి.నాగేశ్వరరావు తెలిపారు. చెన్నారెడ్డి నగర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, బాపూనగర్ పరిధిలో 11.30నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, అంబర్‌పేట పరిధిలో 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, ప్రేమ్‌నగర్ పరిధిలో 3.30 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల నిర్ణయంపై హర్షం

బర్కత్‌పుర, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు చారిత్రాత్మక నిర్ణయమని రాష్ట్ర మేదరి మహేంద్ర సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కేపీ.మురళీకృష్ణ అన్నారు. ఈ రిజర్వేషన్లు దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలువనున్నాయని అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై ఆర్డినెన్స్ జారీచేయాలని మంత్రివర్గ సమావేశం నిర్ణయించుకున్న సందర్భంగా ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి వెదురుతో తయారు చేసిన కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తు మెమొంటోను అందజేశారు.



వెదురుతో తయారు చేసిన హస్తం గుర్తును సీఎం రేవంత్‌రెడ్డికి అందజేస్తున్న మురళీకృష్ణ

- **కవాడిగూడ, జూలై 13 (ఆంధ్రజ్యోతి):** బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి మంత్రివర్గంలో ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకొస్తామని ప్రకటించడం హర్షణీయమని తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం అధ్యక్షుడు గడప శ్రీహరి, తెలంగాణ బీసీ 'ఏ' కులాల హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఎ. భాగయ్య, తెలంగాణ గంగపుత్ర సంఘం యువజన విభాగం అధ్యక్షుడు అంబటి సుధాకర్ గంగపుత్ర, డాక్టర్ సాంబయ్య పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వారు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం నేతలు, బీసీ 'ఏ' కులాల హక్కుల పరిరక్షణ గంఘం నేతలు పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డితో తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం నేతలు, బీసీ 'ఏ' కులాల హక్కుల పరిరక్షణ సమితి నేతలు

42 శాతం రిజర్వేషన్లతో ఒరిగేదేమీ లేదు: టీడీపీ

చిక్కడపల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ల వల్ల బీసీలకు ఒరిగేదేమీ లేదని టీడీపీ జాతీయ ప్రచార కార్యదర్శి జె.దశరథ్ అన్నారు. 42 శాతం రిజర్వేషన్ వల్ల చట్టసభల్లో బీసీలు ఎలా అడుగుపెడుతారో కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ రిజర్వేషన్లు స్థానిక సంస్థల ఎన్నికలకే వర్తిస్తాయని, చట్టసభల ఎన్నికలకు ఏమాత్రం వర్తించవన్నారు. ఒకవేళ నిజంగా బీసీలపై ప్రేమ ఉంటే రాష్ట్రప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలతోపాటు చట్టసభల్లో కూడా రిజర్వేషన్లు కల్పించాలని దశరథ్ డిమాండ్ చేశారు.

ఘనంగా వరాల పోచమ్మ కల్యాణం

చిక్కడపల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ ఆర్టీసీక్రాస్‌రోడ్ జవహర్‌నగర్‌లోని శ్రీ వరాల పోచమ్మ ఆలయంలో అమ్మవారి కల్యాణోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. కల్యాణోత్సవంలో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ యువనేత ముఠా జైసింహ, రాకేష్, బీజేపీ నేత పూస రాజు తదితరులు ప్రత్యేకపూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయం నిర్వాహకులు కనకరాజు, శ్రీరాములు, ఏసురత్నం, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు. కాగా శుక్ర, శనివారాల్లో గణపతి పూజ, నవగ్రహ పూజ, పోచమ్మతల్లికి దుర్గహోమం, గంగతెప్ప, పుట్టబంగారం కార్యక్రమాలు జరిగాయి.

సాంస్కృతిక సంస్థలకు ఆప్తుడు కోట



చిక్కడపల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): దాదాపు 750 చిత్రాల్లో నటించి తన అసామాన్య నటనాప్రతిభాపాటవంతో తెలుగురాష్ట్రాల్లో లక్షలమంది అభిమానాన్ని సంపాదించుకున్న కోట శ్రీనివాసరావు సాంస్కృతిక సంస్థలకు ఆప్తుడు అని ఇటీక్లా, ఫాస్ ఫిలిం సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు డా.కె.ధర్మారావు పేర్కొన్నారు. ప్రముఖ సినీనటుడు, మాజీ ఎమ్మెల్యే కోట శ్రీనివాసరావు మృతిపట్ల ఆయన సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈసందర్భంగా ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 1974 సంవత్సరం నుంచి కోట శ్రీనివాసరావుతో తనకు పరిచయం ఉందని తెలిపారు. ఆయనను తన పర్యవేక్షణలో మూడు సార్లు ఘనంగా సన్మానించామని గుర్తుచేశారు. కొన్ని మాసాల క్రితం ఆయనను తమ ఫాస్ సంస్థ ఆధ్వర్యంలో జీవితసాఫల్య పురస్కారంలో సత్కరించామని తెలిపారు. గతంలో తాము వారం రోజులపాటు నిర్వహించిన నాటక పోటీలను కోట ప్రారంభించారన్నారు.



పలు సభల్లో కోట శ్రీనివాసరావుతో ధర్మారావు పాల్గొన్న చిత్రాలు (ఫైల్)

కోట మృతిపై దిగ్భ్రాంతి

నల్లకుంట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావు మృతి పట్ల ప్రముఖ సంగీత విద్వాంసులు, శ్రీసరస్వతి సంగీత విద్యాలయం ప్రిన్సిపాల్ పోపూరి శ్రీనివాసశర్మ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విభిన్న పాత్రలను పోషించి ప్రేక్షక హృదయాల్లో తన స్థానాన్ని పదిలం చేసుకున్నారని కొనియాడారు. కోట మరణంతో సినిమా రంగం ఒక గొప్ప నటుడిని కోల్పోయిందని ఆయన విచారం వ్యక్తం చేశారు.



కోట శ్రీనివాసరావుతో పోపూరి శ్రీనివాసశర్మ (ఫైల్)